క్లుప్తంగా

భారీ వర్షంతో ముంపునకు గురైన రోడ్లు



అప్పనపల్లిలో రోడ్డుపై భారీగా నిలిచిన ముంపునీరు

మామిడికుదురు: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లు ముంపుబారిన పడ్డాయి. శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీనికి తోడు ఈదురుగాలులు కూడా వీయడంతో బి.దొడ్డవరం, పెదపట్నం లంక, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై ముంపు నీరు భారీగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడి, మామిడికుదురు, నగరం, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, గెద్దాడ తదితర గ్రామాల్లో రహదారులపై భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. 216వ నంబర్ రహదారిపై కూడా భారీగా వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రుతు పవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్ బారిన పడిన బాధితుడికి శనివారం స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యుడు రూ. 11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పొడగట్లపల్లి గ్రామానికి చెందిన ఎ.శేఖర్ బాబు కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రూ.11 వేల నగదును పొడగట్లపల్లి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు.


వలస కార్మికులకు కుష్ఠు నిర్ధారణ పరీక్షలు



ఆలమూరులో కుష్ఠు వ్యాధిపై వలస కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: ఒడిశా, పశ్చిమ బంగా తదితర ప్రాంతాల నుంచి ఇటుక బట్టీలో జీవనోపాధి పొందుతున్న వలస కార్మికులకు శనివారం కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగాయి. కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రత్యేక అధికారి పి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో వైద్యారోగ్య బృందం శనివారం ఆలమూరు, జొన్నాడ ప్రాంతాల్లోని ఇటుక బట్టీలను సందర్శించి కూలీలకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శరీరంపై అనుమానిత మచ్చలు ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కత్తిపూడి ప్రధాన కేంద్రంగా కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అధునాతనమైన డాట్ చికిత్స అందుబాటులో ఉందని వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు. సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏలు పి.కృష్ణవేణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవికి 'పేరి' రాజీనామా



పేరి కామేశ్వరరావు

అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి పేరి కామేశ్వరరావు శనివారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో దానికి నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ పదవికి రాజీమానా చేశానని కామేశ్వరరావు తెలిపారు. తాను వైఎస్సార్ సీపీలో కొనసాగుతానని, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. అంబాజీపేట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి దొమ్మేటి సత్యమోహన్ కూడా శనివారం రాజీనామా చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శనివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోనూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎంతో ఈజీగా ఇంగ్లిష్..

- విద్యార్థులకు ఆంగ్లంపై శిక్షణ
- సులభరీతిలో బోధన



అంబాజీపేటలో స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్‌కు హాజరైన విద్యార్థులు

అంబాజీపేట: సాధారణంగా ఇంగ్లిష్ అంటేనే ఎక్కువ మంది విద్యార్థులకు ఎంతో భయం. మాట్లాడాలన్నా, రాయాలన్నా, చదవాలన్న సంకోచమే. అలాంటి ఇంగ్లిష్‌ను ఎంతో ఈజీగా అందరికి అర్థమయ్యేటట్లు, విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొడుతూ ఎంతో సులువుగా శిక్షణ ఇస్తున్న అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ నిర్వాహకులు. ఇంగ్లిష్ భాషను ఎంతో ఈజీగా విద్యార్థులందరికీ చెబుతూ గత రెండేళ్లుగా అందరి మన్ననలు పొందుతున్నారు.

ముక్కామల ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ టీచర్ అప్పారి శ్రీధర్. గత ఏడాది ఈ శిక్షణలో సుమారు 70 మంది విద్యార్థుల వరకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇవ్వడంతో ఈ ఏడాది మరింత మంది శిక్షణకు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో చదవడం, రాయడం, గ్రామర్, లిజనింగ్, స్పీకింగ్ అండ్ రైటింగ్, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, వ్యక్తి వికాసం తదితర అంశాలపై ఆంగ్ల అధ్యాపకుడు అప్పారి శ్రీధర్ శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఈ స్పోకెన్ ఇంగ్లిష్ వల్ల ఎంతో ఉపయోగపడటంతో వారి తల్లిదండ్రులు క్రమం తప్పకుండా శిక్షణకు పంపించేవారు. తరగతి గదికి వెళ్లిన విద్యార్థులు ఒకరినొకరు ఇంగ్లీష్‌లోనే మాట్లాడే విధంగా తర్ఫీదు నిచ్చారు. ఈ శిక్షణ వల్ల తాము చదవబోయే తరగతులకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు చెబుతున్నారు. ఇంగ్లిష్‌ను అర్థమయ్యే రీతిలో బోధించడం వల్ల సులభంగా ఇంగ్లిష్ పదాలను, మాట్లాడటం నేర్చుకున్నామని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఇంగ్లిష్ ఎంత ఉపయోగమో ఈ శిక్షణ వల్ల తెలిసిందని పలువురు పేర్కొన్నారు. ప్రతి ఏడాది వినాయక యాడ్స్ నిర్వాహకులు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వడంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ఈ శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పోకెన్ ఇంగ్లిష్ ఎంతగానో ఉపయోగపడింది



స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే భయం పోయింది. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న ఇంగ్లిష్ వల్ల చదువుకునే తరగతుల్లో ఎంతో ఉపయోగపడుతుంది. పదాలు కూర్చడం, స్పెల్లింగ్ మిస్టేక్‌లు లేకుండా పదాలు రాయగలుగుతున్నాం.

– లూటికుర్తి సత్యశ్రీ, చిరతపూడి

భాషపై ఆసక్తి కనబర్చారు



గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై ఆసక్తి కనబర్చి ఉత్సాహంగా నేర్చుకున్నాం. ఇంగ్లీష్‌లో ఉన్న ఫండమెంటల్స్‌తో పాటు లిజనింగ్, స్పీకింగ్ అండ్ రైటింగ్, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, వ్యక్తి వికాసంపై శిక్షణ ఇచ్చాం.

– అప్పారి శ్రీధర్, ఎంఏబీఎడ్, ఎస్‌జీటీ టీచర్, ముక్కామల

ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయం



రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గత ఐదేళ్లలో కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో నిలిపామని, ప్రతి ప్రభుత్వానికి యోగ్యతలు, లోపాలు ఉంటాయని, ఏది ఏమైనా ప్రజాతీర్పే అంతిమమని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జీవితంలోనూ, రాజకీయాల్లోనూ ఎన్నో ఎత్తు పల్లాలు చూసిన అనుభవం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని, రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని పడి లేచిన కెరటంలా మరలా తిరిగివస్తామని రావులపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు ద్వారా సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు అందించామని, నూతన ప్రభుత్వం కూడా ప్రజలకు మంచి చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడపాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కొంతమంది అధికారులు కొన్ని విషయాలు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లకుండా చేయడం వలన ఈ ఓటమికి కారణం అయిందన్నారు. గెలుపుని ఆస్వాదించడం అందరూ చేస్తారని దానిని మేము స్వాగతిస్తున్నామని, కానీ ఏదైనా శ్రుతి మించనంతవరకూ బాగుంటుందని అన్నారు. నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ నమ్ముకున్న కార్యకర్తలకు తోడుగా ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను టీడీపీ శ్రేణులు ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు. అలాగే ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీ హరీష్‌కు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీలు కుడుపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, సర్పంచ్ రెడ్డి చంటి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రి వీర్రెడ్డి, జవ్వాది రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన అప్రోచ్ రోడ్డులో ఇక్కట్లు



టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక మధ్య కల్వర్టుకు అప్పనరామునిలంక వైపు చిత్తడిగా మారిన అప్రోచ్ రోడ్డు

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య బాడిరేవు (గోదావరి పాయ)పై ఇటీవల కాలంలో నిర్మించిన పక్కా కల్వర్టుకు అప్పనరామునిలంక వైపు ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ రోడ్డు వర్షాలకు చిత్తడిగా మారింది. అప్రోచ్ రోడ్డు నిమిత్తం వేసిన కంకర గుట్టలతోను, అడపా దడపా కురుస్తున్న వర్షాలకు నిలిచిపోతున్న నీరుతోను ఈ మార్గంలో ప్రయాణికుల రాకపోకలకు అవరోధంగా మారింది. సఖినేటిపల్లి, మలికిపురం మండలాలకు చెందిన వారితో పాటు, వేర్వేరు జిల్లాల నుంచి వాహనాల్లో చించినాడ వంతెన మీదుగా అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రయాణికులు ఇక్కడి బాడిరేవు కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే కల్వర్టుకు టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు కంటే అప్పనరామునిలంక వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు ఎంతో ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రయాణికులతో వెళుతున్న ఒక ఆటో ఇటీవల అప్రోచ్ రోడ్డుకు సమీపంలో గోదావరి పాయలోకి తిరగ బడిన ఘటన చోటు చేసుకుంది. త్రుటిలో ఆటోలోని వారందరికీ పెను ప్రమాదం తప్పింది కూడా. కల్వర్టు అప్రోచ్ రోడ్డుల్లో త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పించాలని స్థానికులు ఆ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

లార్వా అరికడితేనే మలేరియా నిర్మూలన సాధ్యం



మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వీరవల్లిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

అయినవిల్లి: చెత్తకుప్పలు, చెత్తకుండీలు, మురుగు నీటి కాలువల్లో దోమ లార్వా వృద్ధి చెందుతుందని ఆ ప్రదేశాల్లో ఉన్న దోమ లార్వాను వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేసి అరికడితేనే మలేరియాను పూర్తిగా నివారించవచ్చని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీసౌజన్య, పి.విజయ్ అన్నారు. శనివారం వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని బొమ్మరాళ్లతిప్పలో మలేరియా మాసోత్సవం పురస్కరించుకుని మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా ముందుస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్రామంలో వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ లార్వా అధికంగా ఉండే ప్రదేశాలను తనిఖీ చేసి వాటిలో వృద్ధి చెందిన దోమ లార్వాలు ప్రజలకు చూపించి వాటిని నాశనం చేయడంపై అవగాహన కల్పించారు. నీటి వాడకం తగ్గించాలని, మురుగునీరు లేకుండా చూడాలని, నీరు నిలువ ఉన్న ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, కొట్టిపడేసిన కొబ్బరి బొండాల్లో దోమ లార్వా విపరీతంగా వృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు



భక్తులతో కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతా మూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా కల్యాణం

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీ ఫాతిమా జహెరా, హజరత్ అలీ కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి నగరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరం గ్రామంలోని పెద పంజీషాలో కవి సమ్మేళనం జరిగింది. ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా కల్యాణంలోని ముఖ్య ఘట్టాలను కవితల రూపంలో భక్తులకు వివరించారు. తదుపరి మౌలాలీ పంజా నుంచి భార్గాహే ఫాతిమా పంజా వరకు బాణసంచా కాల్పులు, విద్యుత్ దీపాల అలంకరణల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. తదుపరి మిలాద్ జరిగింది. ఎగ్బాల్ హుస్సేన్, జాఫర్ అలీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మత ప్రబోధకుడు షబ్బర్ అలీ జైదీ మిలాద్ ఆలపించారు.

వంతెన పనుల పరిశీలన

పి.గన్నవరం: ఊడిమూడి చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులను మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం పరిశీలించారు. జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ఠ నదిపై రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనుల్లో భాగంగా పంట కాలువపై వంతెన నిర్మాణం పూర్తి కావస్తోంది. రెండేళ్ల క్రితం జగన్‌మోహన్‌రెడ్డి వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో తమకు వంతెన నిర్మించాలని ప్రజలు కోరారు. దీనిపై స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన విషయం విదితమే. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బడికి వేళాయె..

- 13న తెరుచుకోనున్న పాఠశాలలు
- కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ
- కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత అడ్మిషన్లు పూర్తి



ఆలమూరులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆలమూరు/కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గత ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా తీసుకున్న నిర్ణయాలతో జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరుకున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటిని సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఉపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలు తెర చిన వెంటనే విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలతో 2024–25 విద్యా సంవత్సరం ఘనంగా ప్రారంభమవుతుంది ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 12న పునః ప్రారంభం కావలసి ఉండగా కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం దృష్ట్యా ఒక రోజు ఆలస్యంగా ఈనెల 13న ప్రారంభం కానున్నాయి. ఇక విద్యార్థుల ఆటవిడుపుకు స్వస్తి పలికి చదువుకునేందుకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్య నోట్ పుస్తకాలు, షూలు వంద శాతం సరఫరా జరిగింది. అలాగే ఒకటి నుంచి ఏడు తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు 50 శాతం అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో మిగిలిన విద్యా కానుకలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూపు దుస్తులు మండలాలకు చేరుకోనున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజు నుంచి ఒకటి, ఆరు తరగతులు చదివే విద్యార్థులను రికార్డు స్థాయిలో చేర్చుకునేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 584 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో జెడ్పీ హైస్కూల్స్ 84, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు 452, ప్రాథమికోన్నత పాఠశాలలు 48 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

నాడు–నేడు పథకంలో పాఠశాలలు అభివృద్ధి

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఇప్పటికే తొలి విడత నాడు–నేడు పనులు పూర్తి కాగా రెండో విడత పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు. ఇందుకు రూ.135 కోట్లు ఖర్చు చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. 724 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు 724 మందికి ఎంపిక కాగా ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయి. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులు ప్రవేశ రుసుం కింద గ్రామీణ ప్రాంత విద్యార్థులు రూ.ఆరు వేలు చొప్పున ఆయా పాఠశాలలకు చెల్లించాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం



2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. పాఠశాలలు తెరచిన తరువాత అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తాం. ఇప్పటికే పాఠశాలలకు విద్యా కానుకలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

– పీవీ సుబ్బరాజు, ఎంఈఓ, ఆలమూరు

అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

అంబాజీపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఉందని దానిని వక్రీకరించడం మంచి పద్ధతి కాదని.. వాస్తవాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై కె.చిరంజీవి అన్నారు. వాట్సాప్ గ్రూప్‌లో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసినా గ్రూప్ అడ్మిన్‌తో పాటు, మెసేజ్ ఫార్వర్డ్ చేసిన వ్యక్తులపైన శాఖ పరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియా వేదికపై కులాలను, వర్గాలను రెచ్చగొట్టేలా వివాదాస్పద పోస్టింగ్‌లు పెడుతున్నారని వారిపై నిఘా కొనసాగుతోందన్నారు. వివాదాస్పద పోస్టింగ్‌లు ఫార్వర్డ్ చేయడం కూడా నేరమేనన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీసు శాఖ నిరంతరం నిఘాతో అప్రమత్తంగా ఉందని హెచ్చరించారు.

అప్పనపల్లికి కూటమి శ్రేణుల పాదయాత్ర

మామిడికుదురు: రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి పాదయాత్ర చేస్తామని గోగన్నమఠం మాజీ సర్పంచ్ లంకే శ్రీనివాస్ మొక్కుకున్నారు. అనుకున్న ప్రకారం ఎన్‌డీఏ అధికారంలోకి రావడంతో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 35 మంది బృందం శనివారం గోగన్నమఠం నుంచి అప్పనపల్లి వరకు 18 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. పాదయాత్ర చేపట్టిన కూటమి శ్రేణులకు మగటపల్లి, కొమరాడ, మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి గ్రామాల్లో కూటమి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్రలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు ముత్యాల రమానాయుడు, అల్లు సురేష్ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర చేసిన బృందం సభ్యులు అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు.

ఎన్డీఏ గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు

మలికిపురం: ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు అని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబురాజు అన్నారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ చరిత్రలో ఇటువంటి గొప్ప విజయాన్ని ఎన్నడూ చూడలేదని, రాజోలు నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌కు కానీ గతంలో ఏ అభ్యర్థులకు రాని మెజారిటీలు వచ్చాయని అన్నారు. 12వ తేదీ కృష్ణా జిల్లా కేసరపల్లిలో నారా చంద్రబాబు నాయు డు నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా కూటమి కార్యకర్తలు భారీగా పాల్గొని ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, దేవ వరప్రసాద్, గంటి హరీష్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్షసిందూర పూజ



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

అయినవిల్లి: మండలంలోని నేదునూరు హైస్కూల్ వద్ద వేంచేసిన ఆంజనేయస్వామికి శనివారం లక్ష సిందూర పూజ నిర్వహించారు. వేదపండితుడు పెదపూడి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులు ఈ పూజలు జరిపారు. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, కుంభ పూజ, అగ్నిమథనం, హోమం, తర్పణం వంటి విశేష పూజలతో పాటు లక్షసిందూర, లక్ష తమలపాకులతో పూజలు జరిపారు. స్వామికి ఇష్టమైన అప్పాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జనతా ఇన్సూరెన్స్ స్కీంలో చెక్కుల పంపిణీ

సఖినేటిపల్లి: అంతర్వేది పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు మేడిది జగపతిరావు, పోతురాజు భగవన్నారాయణల కుటుంబ సభ్యులకు జనతా ఇన్సూరెన్స్ స్కీంలో మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. రైతులు ఇరువురూ కూడా ఒక రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా పై స్కీంలో మంజూరైనవి. వీటిని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు దూది త్రినాథ్, సభ్యులు జెల్లా శ్రీనివాస్, నల్లి మరియమ్మ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘ సీఈవో పినపోతు ప్రభాకర్, బెల్లంకొండ ఏసుబాబు, బెల్లంకొండ రామకృష్ణ పాల్గొన్నారు.



అంతర్వేది పీఏసీఎస్ వద్ద చెక్కులు ఇస్తున్న దృశ్యం